# నమ్మదగిన మాట

**గో**పాలానికొక పెద్ద ధర్మ సందేహం పట్టుకుంది – ఆ సినిమా ట్రూపులో బొంబాయి వెళ్లిన తన తమ్ముడు పార్వతీశం ఎవతెనన్నా తగులుకున్నాడా, లేదా?

తన తమ్ముడి నైతిక క్షేమంతో గోపాలానికేం పనో ఊహించటం కష్టం. తమ్ముడు ఎవతెనన్నా తగులుకున్నాడని రుజువైతే తన కెక్కువ తృప్తో, నీతిగా ఉన్నాడంటే ఎక్కువ తృప్తో గోపాలానికే తెలీదు.

గోపాలానికి ఒక్కటే తెలుసు! పార్వతీశాన్ని తను పెంచి పెద్దవాణ్ని చేశాడు. చదువు పూర్తిగా చెప్పించాడు! ఇక ఇంటివాణ్ని చెయ్యటం మాత్రమే తన మీద ఉంది. ఈ పరిస్థితుల్లో పార్వతీశం ఇప్పుడే కోతి కళలు పోవటం జరిగితే, ఏ నిక్షేపమంటి పిల్లనో తెచ్చి వాడి కంటగట్టటం తనవల్ల ఒక్కనాటికి్కూడా జరగదు!

తన తమ్ముడి మీద కంటె, గోపాలానికి, ఆ తమ్ముడికి ముడిబెట్టబోయే పిల్ల మీద ఇంత అభిమానం దేనికో అదికూడా మనం సులభంగా ఊహించలేం.

ఏమైనా పార్వతీశం ప్రవర్తనను గురించి స్పష్టంగా తెలుసుకునేదాకా గోపాలానికి నిద్రపట్టే లక్షణాలు కనిపించలేదు.

అసలే సినిమా కంపెనీ! అందరూ లఫూటుగాళ్లు చేరుతారు. ఆపైన ఆడవాళ్లూ మగవాళ్లూ కలిసి తైతక్కలాట్టం! ఆ ముండలన్నా సంసార్లా అంటే – సంసార్లు హాయిగా మొగుళ్లకు వంటచేసి పెడుతూ పిల్లల్ని కనక సినిమాల్లోకెందుకు పోతారు?

పార్వతీశం వెంట తమ గ్రామం నించి ఇంకా అయిదారుగురు వెళ్లారు. అసలా సినిమా తీసిన కంపెనీ ఆ వూరివాళ్లదే. అందుకని గోపాలం నలుగురిదగ్గిరా ఆరా తియ్యటానికి బయల్దేరాడు.

"ఏమోయ్, లక్ష్మీనారాయణా! నువుకూడా బొంబాయి వెళ్లావుగామల్లు. ఏమిటి కబుర్లు? మా తమ్ముడు, పార్వతీశం ఒళ్లు దగ్గిర పెట్టి మసులుకున్నాడా!" అన్నాడు గోపాలం.

"వొళ్లు ఎవరిదగ్గిర పెట్టి?"

తాగుబోతు వెధవ! వాణ్ని అడగటం తనదే పొరపాటు!

"ఏమండీ, కృష్ణశాస్త్రిగారూ! మీరంతా కలిసేవున్నారుగామాలు. మా తమ్ముడు పార్వతీశం, ఆడవాళ్ల జోలికేమీ పోలేదుకదా?"

"ఎబ్బే. అటువంటిదేమీ ఉన్నట్టులేదు లెండి. నా కతనితో ఆటే పరిచయం కలగలేదు గాని - వస్తాను!"

ఎందుకు చెబుతాడూ? అంతా తోడుదొంగలు!

"ఏమోయ్, సూర్యం మావాడు బొంబాయిలో భటాచోరుముండల్నెవర్నీ తగులుకోలేదుగద?"

"ఓ రహస్యం చెప్పనా? మళ్లీ ఎవరితోనన్నా అనేరు! నేను తలుపు కంతల్లోనుంచి చూశాగాని, నాకేమీ కనిపించలా, చీకట్లో! తెలీని మాటచెప్పి ఎట్లా పాపం కట్టుకునేది!"

వీడో దొమ్మర ముండాకొడుకు! చిన్నంతరమూ పెద్దంతరమూ ఎరగడు!

ఇంత శ్రమపడి ఆ ముండదగ్గిరికి పోయి అదేమంటుందో ఆ సంగతి కూడా తేల్చుకొస్తే సరిపోతుందిగా!

గోపాలం ప్రాణాలరిచేతిలో పట్టుకొని దాని ఇల్లు విచారించుకుంటూ వెళ్లాడు.

పొద్దూకూకిందప్పుడే, "కూర్చోండి, పంతులుగారూ?" అంటూ అది తన ఎదటే చీర విప్పి మరో చీర కట్టసాగింది.

"అయితే - ఇదుగో - చూడూ! నీ పేరేమిటో? మీ వెంట పార్వతీశమని ఒక కుర్రాడొచ్చాడే! వాడు మీతో వచ్చిన ఆడవాళ్లనెవర్నాన్నా మరిగాడా?"

"ఆ అబ్బాయి అటువంటివాడయితే నేనొదిలిపెడతానుటండి, పంతులు గారూ?... వెళుతున్నారేం? రాత్రికుండరూ?"

అదురుతున్న గుండెతో గోపాలం బయటపడ్డాడు. తన తమ్ముడి శీలం చెడలేదని రూఢీ అయిందిగాని, అందువల్ల కలగదగిన సంతోషం మాత్రం గోపాలానికి కలగలేదు.

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***
***యువ కార్యాలయం, తెనాలి***